రాష్ట్రంలో 10 ఫార్మా విలేజ్‌లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి • బయోఏషియా-2024 సదస్సు ప్రారంభం • త్వరలో జీనోమ్ వ్యాలీ రెండో దశ • కంపెనీలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్న సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. 21వ బయోఏషియా-2024 వార్షిక సదస్సును మంగళవారం హెచ్ ఐసీసీలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో తెలంగాణ వ్యాప్తంగా 10 ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైందని చెప్పారు. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అంతేగాక 5 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే రూ.2,000 కోట్ల పెట్టుబడితో 300 ఎకరాల్లో త్వరలో జీనోమ్ వ్యాలీ రెండో దశను ప్రారంభించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కంపెనీలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చేవారికి ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సొంత ఇంటికి వచ్చినట్టుంది..

హైదరాబాద్‌కు రావడమంటే సొంతింటికి వచ్చినట్టు అనిపిస్తున్నది. ఇక్కడి ప్రజలు, అలవాట్లు నాకు ఎంతో నచ్చుతాయి. హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్‌ను నెలకొల్పడానికి ఇది కూడా ఓ కారణంగానే చెప్పుకోవచ్చు. గత నాలుగేండ్లుగా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో మా సంస్థకు ఇదే ప్రధాన కేంద్రంగా మారిపోయింది. మా సంస్థకు మార్కెట్ పరంగా భారత్ ఎంతో కీలకం.

- ప్రొవిడెన్స్ ప్రెసిడెంట్, సీఈవో రోడ్నీ హోఫ్‌మ్యాన్

ముందుగా 3 జిల్లాల్లో..

వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను తొలుత ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరయ్యే రీతిలోనే వీటిని తెస్తున్నట్టు చెప్పారు. ఇక ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక సందర్భంగా రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు గుర్తుచేశారు. ఈ క్రమంలోనే హైదరాబాదీ సంస్థలతో ఆయా దేశాల కంపెనీలు జట్టు కడుతుండటం, నగరంలో వివిధ పెట్టుబడులకు దిగుతుండటంపట్ల సంతోషం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నుంచే భరోసా..

కోవిడ్ అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న బయోఏషియా సదస్సు ప్రాధాన్యత సంతరించుకున్నదని పేర్కొన్నారు. అయితే కరోనా ప్రపంచానికి భయాన్ని కల్పిస్తే, హైదరాబాద్ నమ్మకాన్ని కల్పించిందన్నారు. ఆరోగ్య సమస్యలనేవి మానవాళి మొత్తానికి ఒకేలా ఉంటాయన్న ఆయన.. వాటి పరిష్కారానికి అంతా కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను కోవిడ్ చాటిచెప్పిందన్నారు. హైదరాబాద్ నేడు లైఫ్‌సైన్సెస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఎదిగిందని, కోవిడ్ కారణంగా ప్రపంచమంతా భయంతో అతలాకుతలమైన సందర్భంలో మూడు వ్యాక్సిన్లలో ఒకటి ప్రపంచానికి నగరంలోని సంస్థే అందించిందని గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాలుగా బయోఏషియా సదస్సు ఫార్మా, జీవశాస్త్రాల రంగం అభివృద్ధికి తోడ్పడుతూ మొత్తం ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని కొనియాడారు. ఐటీ, సాఫ్ట్‌వేర్, రిసెర్చ్, స్టార్టప్స్‌కూ హైదరాబాద్ క్యాపిటల్‌గా మారిందన్నారు. విధానాలు, మౌలిక సదుపాయాలపరంగా పరిశ్రమకు సహకరించేందుకు, ఇందుకు అవసరమైన ఎకోసిస్టంను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సీఎం భరోసా ఇచ్చారు.

ఎంఎస్‌ఎంఈలకు ప్రాధాన్యత

తమ ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇవి స్టార్టప్స్‌కు, బడా కార్పొరేట్ కంపెనీలకు మధ్య వారధిగా ఉంటాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫార్మా రంగంలోని సమస్యలను తెలుసుకునేందుకు ఇటీవలే తాను ఆ రంగానికి చెందిన ప్రముఖులతో సమావేశమైనట్టు ప్రభుత్వపరంగా వీలైనంత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వారికి భరోసా కల్పించామని తెలిపారు. కాగా, నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్ సెమెంజాకు జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024ను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రదానం చేశారు. అలాగే 'ఇండియన్ ఫార్మా ట్రాన్స్‌ఫార్మేషన్ డాటా అండ్ ఏఐ' పేరుతో బయోఏషియా-2024పై శ్వేతపత్రం విడుదల చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న తకేడా, బయోలాజికల్ ఈ, మిల్టెనీ బయోటెక్, టర్మినస్ గ్రూప్, ఆర్ఎక్స్ ప్రొపెలెంట్ కంపెనీల ప్రతినిధులనూ సత్కరించారు.

కొత్త లైఫ్‌సైన్సెస్ పాలసీ

వచ్చే కొద్ది నెలల్లోనే కొత్త లైఫ్‌సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా ప్రకటించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా టెక్నాలజీ, లైఫ్‌సైన్సెస్, ఔషధాలు, స్టార్టప్స్, రెగ్యులేటరీ తదితర అంశాల సమ్మిళితంగా ఈ పాలసీ ఉంటుందన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణను ఆదర్శంగా నిలుపుతామని చెప్పారు. గత 20 ఏండ్లుగా జరుగుతున్న బయోఏషియా సదస్సు ద్వారా ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు లభించిందని, ఫలితంగా దావోస్ సదస్సు సందర్భంగా ప్రపంచంలోని అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయని మంత్రి పేర్కొన్నారు. బీఎంఎస్, ప్రొవిడెన్స్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమని, వారికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగం అభివృద్ధికి తమ శాయశక్తులా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. ఇక పెట్టుబడుల ఆకర్షణ ద్వారా సామాజిక, ఆర్థికాభివృద్ధితోపాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దేందుకు సీఎం కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేశారు. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే రెండేండ్లలో విద్యా సంస్థలు, పరిశ్రమను అనుసంధానం చేసేలా ఓ పాలసీని ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. విద్యార్థులకు పరిశ్రమలో 3-6 నెలల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను తప్పనిసరి చేస్తామని, ఇది ఉద్యోగాలు పొందేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయా రంగాలకు అవసరమైన నైపుణ్యాలుగల ప్రతిభావంతులతో బెస్ట్ హ్యూమన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ ఎదుగుతుందన్న ఆశాభావాన్ని శ్రీధర్ బాబు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెస్టర్న్ ఆస్ట్రేలియా ఆరోగ్య శాఖ మంత్రితోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, బయోఏషియా సదస్సు సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ కంపెనీతో బీఈ జట్టు

బయోలాజికల్-ఈ లిమిటెడ్(బీఈ).. జపాన్ కంపెనీ తకేడా ఫార్మాతో జట్టుకట్టింది. ప్రస్తుతం ఏడాదికి 5 కోట్ల డెంగ్యూ వ్యాక్సిన్లను తయారు చేస్తున్న బీఈ..తకేడాతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఈ సామర్థ్యం రెండింతలు కానున్నదని బీఈ ఎండీ మహిమ దాట్లా తెలిపారు. 2030 నాటికి డెంగ్యూ వ్యాక్సిన్ల కెపాసిటీని 10 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..అందుకు తగ్గట్టుగానే ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా క్యూడెంగ్యూ(డెంగ్యూ టెట్రావాలెంట్ వ్యాక్సిన్) మల్టీ-డోస్ వైల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు ప్రకటించింది. జాతీయ ఇమ్యూనైజేషన్ ప్రొగ్రాములో భాగంగా ప్యాకేజింగ్‌ను తగ్గించడం, స్టోరేజీ ఖర్చులు తగ్గించుకోవడం, మెడికల్, పర్యావరణ వ్యర్థాలు తగ్గించే ఉద్దేశంలో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టింది. దీంట్లోభాగంగానే బీఈ..జపాన్‌కు చెందిన తకేడాతో ఒప్పందం కుదుర్చుకొనే అక్కడే ఈ వ్యాక్సిన్లను తయారు చేయబోతున్నది. ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ జ్వరంతో బాధపడేవారి సంఖ్య 30 రెట్లు పెరిగారని, ముఖ్యంగా పట్టణీకరణ, రవాణా, వాతావరణంలో వచ్చే మార్పులు కారణంగా ఈ వ్యాధి వస్తున్నదని పేర్కొంది. ప్రతియేటా 100 దేశాల్లో 39 కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ యూరప్‌తో పాటు ఇండోనేషియా, థాయిలాండ్, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల్లో లభిస్తుండగా.. భారత్‌లో మాత్రం లభించడం లేదు.

హెచ్ఐసీసీలో మంగళవారం 21వ బయోఏషియా-2024 సదస్సు ప్రారంభం సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వెస్టర్న్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు

హెల్త్‌కేర్ రంగంలో పెట్టుబడులకు సిద్ధం

వెస్టర్న్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్

రాష్ట్ర హెల్త్‌కేర్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు వెస్టర్న్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సులో ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దేశంలో తొలి కమర్షియల్ కార్యాలయాన్ని కూడా ఇక్కడే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. హెల్త్‌కేర్, హెల్త్ టూరిజం, హెల్త్ స్కిలింగ్ విభాగాల్లో పెట్టుబడులకు అవకాశాలున్నాయని ఈ సందర్భంగా సీఎం ఫార్మా దిగ్గజాలకు సూచించారు. సీఎంను కలిసిన వారిలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీ జెర్మీజూర్గన్స్ కూడా ఉన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సూచించిన ఆయన..ప్రధానంగా వ్యాపార పంటలపైన దృష్టి సారించాలన్నారు. సెమికండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి మరికొందరు పారిశ్రామికవేత్తలు ముందుకురాగా, కావాల్సిన భూమితో పాటు ఇతర సదుపాయాలను కల్పిస్తామని రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదని ఆయన అన్నారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా హబ్‌గా కొనసాగుతున్నదని, మరిన్ని రంగాల్లో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని సీఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో మిల్టెనీ తొలి కార్యాలయం

హైదరాబాద్, ఫిబ్రవరి 27: జర్మనీకి చెందిన బయోమెడికల్ ఉత్పత్తుల తయారీ సంస్థ మిల్టెనీ బయోటెక్..భారత్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించిన సంస్థ..భవిష్యత్తులో ఇక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా వేదికపై కంపెనీ ఎండీ బోరిస్ స్టోఫెల్ ఈ విషయాన్ని ప్రకటించారు. ముందస్తు క్లినికల్/క్లినికల్ డెవలప్‌మెంట్, వాణిజ్య అవసరాలని మిత్తం సైంటిస్టులు, పరిశోధకులు, పరిశ్రమ వర్గాలు, క్లాస్‌రూమ్‌లో క్లినికల్‌కు సంబంధించి ప్రయోగాత్మక శిక్షణ పొందేందుకు వీలుగా ఈ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన చెప్పారు. దేశీయ సైంటిస్టులు, పరిశోధకులు సులభంగా వారి రిసెర్చ్‌లను చేయడానికి వీలు పడనున్నదని తెలిపింది. ఈ కేంద్రం శాస్త్రీయ సమాజంలో చికిత్సలను అభివృద్ధి చేయడంలోను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రోగులకు ఆరోగ్య సంక్షరణకు సహాయపడటానికి దోహదం చేయనున్నదన్నారు.

ఇతర అవసరాలకు ఫార్మాసిటీ భూములు

రాష్ట్రవ్యాప్తంగా 10 ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నామని, ఒక్కో క్లస్టర్ 1,000 నుంచి 2,000 ఎకరాల్లో ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. పర్యావరణ సమస్యలు రాకుండా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఇతర అవసరాలకు ఉపయోగిస్తామన్నారు. అభివృద్ధి ఒకే ప్రాంతానికి కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరింపజేయడమే తమ విధానమని చెప్పారు. వచ్చే ఐదేండ్లలో 20 నుంచి 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు జీనోమ్ వ్యాలీకి వస్తాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. ప్రపంచ వాణిజ్య వేదిక సదస్సు తరహాలోనే లైఫ్‌సైన్సెస్ రంగంలో బయోఏషియా ఎదగడం మనందరికీ గర్వకారణమన్నారు. 2000 పైచిలుకు రిజిస్ట్రేషన్లు మొదటిరోజే నమోదయ్యాయని, ఇందులో ఫార్చ్యూన్-500 కంపెనీలకు చెందిన సీఈవోలు పాల్గొంటున్నారన్నారు.

అధిక పెన్షన్ కల భగ్నం?

ఈపీఎఫ్‌వో కొత్త మెలిక • నిబంధనల మార్పుతో 40 శాతం వరకు తగ్గనున్న పింఛన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అధిక పెన్షన్ ఆశిస్తున్న ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) గట్టి షాక్ ఇచ్చేలా నిబంధనల్లో మార్పు చేసున్నదన్న వార్తలు తాజాగా వెలువడుతున్నాయి. నిర్దేశిత పరిమితికి మించిన జీతంపై పీఎఫ్ చెల్లించే ఈపీఎస్-95 సభ్యులకు అధిక పెన్షన్‌ను వర్తింపచేయాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి సంవత్సరంన్నర కావొస్తున్నా, ఈపీఎఫ్‌వో అనేక ఆప్షన్స్‌ను అప్పుడప్పుడూ ప్రకటిస్తూ తాత్సారం చేసింది. అన్ని తతంగాల్ని పూర్తిచేసినట్టుగా ఈ జనవరి తొలినాళ్లలోనే సంస్థ సంకేతాలివ్వడంతో అధిక పెన్షన్ కల ఇక నెరవేరుతుందన్న తరుణంలో పెన్షన్ కాలిక్యులేషన్‌కు కొత్త విధానాన్ని తెస్తున్నట్లు వార్త. ఇందుకు సంబంధించి ఈపీఎఫ్‌వో ఎటువంటి సర్క్యులర్‌నూ జారీచేయనప్పటికీ, వివిధ ప్రాంతాల్లోని తమ కార్యాలయాలకు కొత్త క్యాలిక్యులేషన్ విధానాన్ని తెలియపర్చినట్టు సమాచారం. తాజా రూల్ ప్రకారం ప్రొరాటా ప్రాతిపదికన పెన్షన్ ఎంత ఇవ్వాలన్నది నిర్ణయిస్తారు. దీంతో అధిక పెన్షన్‌కు అర్హులైనవారికి వచ్చే పెన్షన్ 30 శాతం నుంచి 40 శాతం వరకూ తగ్గుతుందని అంచనా.

సర్వీసు కాలం రెండు భాగాలుగా విభజన

వివిధ ప్రాంతాల్లోని కార్యలయాలకు ఈపీఎఫ్‌వో నుంచి వచ్చిన సమాచారం ప్రకారం అధిక పెన్షన్ కోరుకుంటున్న ఉద్యోగి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజిస్తారని ఎకనామిక్ లా ప్రాక్టీస్ సంస్థలోని లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రాక్టీస్ హెడ్ పీవీ మూర్తి చెప్పారు. కొత్తగా విడుదల చేసినట్టు చెపుతున్న విధానం కింద వీరి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజించి, సగటు పెన్షన్‌బుల్ సేలరీని లెక్కిస్తారు. ఈపీఎస్-95 అమలులోకి వచ్చిన తేదీ 16.11.95 నుంచి 31.08.2014 వరకూ తొలిభాగంకాగా, 01.09.2014 నుంచి రిటైర్ అయ్యేంతవరకూ రెండో భాగంగా చూస్తారని మూర్తి వివరించారు. ప్రథమ భాగంలోని చివరి 60 నెలల సగటు జీతాన్ని పెన్షన్ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకుంటారు. ద్వితీయ భాగంలో చివరి 60 నెలల సగటు జీతం లేదా 01.09.2014 నుంచి పదవీ విరమణ చేసిన తేదీ (31.08.2019లోపు రిటైర్‌మెంట్)వరకూ సగటు నెల జీతాన్ని లెక్కలోకి తీసుకుంటారు. దీని ప్రకారం ప్రొరాటాగా రెండు భాగాలుగా పెన్షన్ విభజించి చెల్లిస్తారు. అయితే ఈ ప్రొరాటా పెన్షన్ గణనను ఈపీఎఫ్‌వో అధికారికంగా ధృవీకరించలేదని, దానిని వివరించే సర్క్యులర్ ఏదీ జారీ కాలేదని లా ప్రాక్టీసింగ్ సంస్థ కరంజవాలా అండ్ కో పార్టనర్ మన్‌మీత్ కౌర్ తెలిపారు.

ఎందుకు తగ్గుతుంది?

ప్రొరాటా ప్రాతిపదికన కొత్త క్యాలిక్యులేషన్ రూల్ ప్రకారం అర్హులైనవారికి వచ్చే పెన్షన్ గణనీయంగా తగ్గనుంది. ఎందుకంటే 2014 సెప్టెంబర్‌కు ముందుకాలంలో వేతనాలు ఇప్పటితో పోలిస్తే బాగా తక్కువ. అంటే తొలిభాగం 60 నెలల సగటు జీతానికి తగినట్టు అప్పటి పెన్షన్‌ను గణిస్తారు. మలిభాగం సగటుతో మరో పెన్షన్‌ను గణించి, రెండింటి సగటుతో తుది పెన్షన్ లెక్కింపు జరుగుతుంది. దీంతో మొత్తంగా వచ్చే పెన్షన్ తగ్గిపోతుంది. ఈపీఎఫ్‌వో ఇప్పటికే ప్రకటించిన విధానం ప్రకారం సర్వీసులో చివరి 60 రోజుల సగటు వేతనం ఆధారంగానే పెన్షన్ లెక్కింపు జరుగుతుంది. కానీ ఈపీఎఫ్‌వో కొత్త విధానాన్ని అవలంబిస్తే 30 శాతం నుంచి 40 శాతం తగ్గుతుందని, ఇది సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని పీవీ మూర్తి చెప్పారు. ఈపీఎఫ్‌వో పెన్షన్ కాలిక్యులేషన్ రూల్ మార్చడం ద్వారా పెన్షన్ చెల్లింపు మొత్తాన్ని తగ్గించాలన్న లక్ష్యమే కన్పిస్తున్నదన్నారు. ఈ కొత్త మెథడాలజీని ఈపీఎఫ్‌వో నోటీఫై చేసినట్టయితే రిటైరీలు సుప్రీంకోర్టులో సవాలు చేయవచ్చని మన్‌మీత్ కౌర్ సూచించారు.

మొబిక్విక్ 'పాకెట్ యూపీఐ'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశీయ పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ మొబీక్విక్.. ఓ సరికొత్త ఫీచర్‌ను తమ వినియోగదారుల కోసం తీసుకొచ్చింది. బ్యాంక్ ఖాతాతో అనుసంధానం లేకుండానే చెల్లింపులు జరిపేలా 'పాకెట్ యూపీఐ' సౌకర్యాన్ని పరిచయం చేసింది. ఇకపై కస్టమర్లు తమ ఖాతాల్ని లింక్ చేసుకోకుండానే మొబీక్విక్ వ్యాలెట్ ద్వారా యూపీఐ పేమెంట్స్‌ను ఈ పాకెట్ యూపీఐతో చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. బ్యాంక్ ఖాతా నుంచి నిధుల బదిలీ కంటే మొబీక్విక్ వ్యాలెట్ నుంచి బదిలీయే సురక్షితమని, ఆర్థిక మోసాలకు తావుండదని ఈ సందర్భంగా మొబీక్విక్ తెలిపింది.

తగ్గిన బొగ్గు దిగుమతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: బొగ్గు దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి మధ్యకాలంలో 36.69 శాతం తగ్గి 19.36 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం 30.58 మిలియన్ టన్నులే. విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ బొగ్గు దిగుమతులు తగ్గుముఖం పట్టడం విశేషమని బొగ్గు మంత్రిత్వ శాఖ అన్నది.

మార్కెట్‌లోకి సరికొత్త పల్సర్

గరిష్ఠ ధర రూ.1.57 లక్షలు

పుణె, ఫిబ్రవరి 27: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..దేశీయ మార్కెట్లోకి నయా పల్సర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024 ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ పల్సర్ ఎన్ఎస్ సిరీస్ బైకులను తీసుకొచ్చింది. పల్సర్ ఎన్ఎస్ 2024 సిరీస్, ఎన్ఎస్200, ఎన్ఎస్160, ఎన్ఎస్ 125 మూడు రకాల్లో లభించనున్న ఈ బైకులు రూ.1,57,427, రూ.1,45,792, రూ.1,04,922 ధరను నిర్ణయించింది. నూతన డిజిటల్ కన్సోలెస్ అండ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్‌తో తీర్చిదిద్దింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను సెమీ-డిజిటల్, బ్లూటూత్ కనెక్టివిటీ, ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్ అలర్ట్, ఫోన్ బ్యాటరీ సామర్థ్యం, సిగ్నల్ లెవల్, నావిగేషన్ కూడా తెలుసుకోవచ్చును. 150 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైకుల విక్రయాల్లో ఈ బైకు అత్యధికంగా నమోదవుతున్నది.

జీతాలు 10% పెరుగుతాయ్: మెర్సర్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఉద్యోగులకు శుభవార్త. ఈ ఏడాది జీతాలను దేశంలోని సంస్థలు సగటున 10 శాతం పెంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఆటోమొబైల్, తయారీ, ఇంజినీరింగ్ రంగాల్లోని ఎంప్లాయీస్ వేతనాలు ఎక్కువగా పెరుగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ మెర్సర్స్ చేపట్టిన 'టోటల్ రెమ్యునరేషన్ సర్వే' (టీఆర్ఎస్) విడుదలైంది. ఇందులోనే ఈసారి ఉద్యోగుల జీతాలు సగటున 10 శాతం పెరుగవచ్చని తేలింది. గత ఏడాది జీతాల పెంపు సగటున 9.5 శాతంగా ఉన్నట్టు మెర్సర్స్ తమ తాజా రిపోర్టులో పేర్కొన్నది. 'దేశ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందనడానికి ఇదో నిదర్శనం. ప్రతిభావంతులు ఎక్కువగా ఉన్నారనడానికీ సంకేతమే. ఇక ఈ ఏడాది ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లోని ఉద్యోగుల జీతాలు పెరగవచ్చు' అని సర్వే పేర్కొన్నది. గత ఏడాది మే, ఆగస్టు మధ్య ఈ సర్వేను జరిపారు. 1,474 సంస్థల్లోని 6 వేల మందికిపైగా అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సంస్థల్లో 21 లక్షల మందికిపైగా ఉద్యోగులుండటం విశేషం. వ్యక్తిగత, సంస్థాగత పనితీరు తదితర అంశాల ప్రాతిపదికన సర్వే చేపట్టారు. మరోవైపు కంపెనీలను ఉద్యోగులు స్వచ్ఛంధంగా వీడుతున్న సందర్భాలు క్రమేణా పెరుగుతున్నాయని, 2021లో 12.1 శాతంగా ఉంటే, 2022లో 13.5 శాతంగా ఉందని సర్వే తెలిపింది.

స్కోడా నుంచి ఈవీ

ముంబై, ఫిబ్రవరి 27: ఫ్రెంచ్‌నకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం స్కోడా.. దేశీయ మార్కెట్లోకి ఎలక్ట్రిక్ కారును విడుదల చేయడానికి సిద్ధమైంది. 2027లోనే భారత మార్కెట్లోకి ఈవీని విడుదల చేయాలనుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించింది. తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎన్యాక్‌ను ఈ ఏడాది భారత్‌లో పరిశీలించనున్నది. ఈ-మొబిలిటీపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, వచ్చే మూడేండ్లకాలంలో ఆరు మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయాలనుకుంటున్నట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనెబా తెలిపారు. ఈవీని భారత్‌లో ఉన్న ప్లాంట్లోనే అసెంబ్లింగ్ చేయనున్నట్లు, 2027 నాటికి ఈ మాడల్‌ను తీర్చిదిద్ది విడుదల చేయాలనుకుంటున్నట్లు చెప్పారు.

యూబీఐతో మారుతి జట్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్‌తో మారుతి సుజుకీ జతకట్టింది. కంపెనీకి చెందిన డీలర్లకు ఆర్థిక సహాయం అందించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శశాంక్ శ్రీవాత్సవ తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 4 వేల డీలర్లకు ఆర్థిక సహాయం లభించనున్నది. 2008 నుంచి యూనియన్ బ్యాంక్‌తో కలిసి పనిచేస్తున్నట్లు, ఇప్పటి వరకు 3 లక్షల కార్లకు రుణాన్ని అందించిందన్నారు. ఈ సందర్భంగా యూబీఐ ఎండీ, సీఈవో ఏ మణిమేఖలాయ్ మాట్లాడుతూ.. కస్టమర్లకు సులభంగా రుణాన్ని అందించాలనే ఉద్దేశంతో మారుతితో జట్టుకట్టినట్టు, ఇప్పటి వరకు లక్షలాది కార్లకు రుణాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు.

భవిష్యత్ భారత్‌దే: మారుతి చైర్మన్

మరే దేశంలోనూ లేనంత స్థాయిలో భవిష్యత్ వృద్ధి అవకాశాలు భారత్‌లో ఉన్నాయని మారు